## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తల

తేదీ: 07-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- యువత.. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కఠిన వైఖరిని అవలంబించాలని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు గుజరాత్, మహారాష్ట్రలలో పర్యటించి.. 35 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు.

- రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి విజ్ఞాన కేంద్రాల బలోపేతం ఆవశ్యకమని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

- భారతదేశ రక్షణ విధానం.. ప్రతిస్పందించే ధోరణి నుండి ముందుచూపుతో వ్యవహరించే ధోరణికి మారిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

========================

యువత.. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కఠిన వైఖరిని అవలంబించాలని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. గౌహతి విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. మాదకద్రవ్య వ్యతిరేక పోరాటానికి యువత కట్టుబడి ఉండాలని కోరారు. ఒక విద్యా సంస్థ విలువలు.. ర్యాంకులను పొందడంలోనే కాక, సమాజాన్ని మార్చే సామర్థ్యంలో కూడా ఉంటుందన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యను మరింత వినూత్నంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. విద్య, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, తదితర రంగాలలో మానవ వనరుల అభివృద్ధికి గౌహతి విశ్వవిద్యాలయం చేసిన కృషిని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రశంసించారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు గుజరాత్, మహారాష్ట్రలలో పర్యటించనున్నారు. గుజరాత్‌లోని వడోదరలో 35 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి వాటిని జాతికి అంకితం చేస్తారు. 9 వేల 700 కోట్ల రూపాయలకు పైగా విలువైన 3 రైల్వే ప్రాజెక్టులకు, సుమారు 1,780 కోట్ల రూపాయల విలువైన 3 జాతీయ రహదారి ప్రాజెక్టులకు, 2 వేల 600 కోట్ల రూపాయల విలువైన గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. న్యూ సనంద్ (నార్త్), న్యూ మకర్పురా, న్యూ ఉంబర్‌గావ్, ముంబైలోని న్యూ జేఎన్‌పీటీ నుండి సరుకు రవాణా రైలు సర్వీసులను, వడోదర - టాండా రోడ్ మధ్య కొత్త రైలు సర్వీసును ప్రారంభిస్తారు. అలాగే ప్రధానమంత్రి మహారాష్ట్రలోని ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (GFF) 2026ను ప్రారంభించి, సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-లక్సెంబర్గ్‌ల మధ్య విశ్వసనీయ సంబంధం ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. 3 రోజుల భారత పర్యటన నిమిత్తం ఈరోజు న్యూఢిల్లీకి చేరుకున్న లక్సెంబర్గ్ ఉప ప్రధానమంత్రి, విదేశీ వాణిజ్య శాఖ మంత్రి జేవియర్ బెటెల్‌తో జైశంకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. బెటెల్ పర్యటన, భారత్-లక్సెంబర్గ్‌ల మధ్య బలపడుతున్న భాగస్వామ్యానికి నిదర్శనమని, వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారం ఈ సంబంధానికి కీలకంగా ఉన్నాయని చెప్పారు. అంతరిక్షం, డిజిటల్, గ్రీన్ టెక్నాలజీలలో కూడా ఇరుపక్షాలు సహకారం కోసం ఎదురుచూస్తున్నాయన్న ఆయన, కోవిడ్ మహమ్మారి తరువాత భారత్-లక్సెంబర్గ్‌ల మధ్య సహకారం మరింత పెరిగిందని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కృషి విజ్ఞాన్ కేంద్రాల (కేవీకేల) బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వాల చురుకైన భాగస్వామ్యం, మద్దతు అవసరమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. కేవీకేలను బలోపేతం చేసే కార్యాచరణ ప్రణాళికను సమీక్షించేందుకు న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 2027 మార్చి నాటికి ప్రాధాన్యతా క్రమంలో 300 కేవీకేల మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేయాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. కేవీకేల పరివర్తనకు బలమైన కేంద్ర-రాష్ట్రాల సమన్వయం, సకాలంలో ఆర్థిక సహాయం, ఆధునిక మౌలిక సదుపాయాలు, జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికల సమర్థవంతమైన అమలు అత్యంత ఆవశ్యకమని ఉద్ఘాటించారు. రైతులకు సమర్థవంతంగా సేవలందించేందుకు, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లకు స్పందించేందుకు కేవీకేలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, సంస్థాగత మద్దతు లభించేలా చూడటం కీలకమని శివరాజ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ రక్షణ విధానం.. ప్రతిస్పందించే ధోరణి నుండి ముందుచూపుతో వ్యవహరించే ధోరణికి మారిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రక్షణ రంగంలో దేశం స్వయం సమృద్ధి, ఆత్మవిశ్వాసం రెండింటినీ సాధించిందన్నారు. భారత్ 2016లో క్షిపణి సాంకేతిక నియంత్రణ వ్యవస్థ (MTCR)లోకి ప్రవేశించడం వల్ల బ్రహ్మోస్ క్షిపణి పరిధిని పెంచగలిగిందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణి తన సామర్థ్యాన్ని నిరూపించుకుందని, దాని ప్రభావాన్ని పాకిస్తాన్ కూడా గుర్తించిందని అన్నారు. సరిహద్దు భద్రతను బలోపేతం చేయడం, సాయుధ దళాలను ఆధునీకరించడం, స్వదేశీ ఉత్పత్తిని పెంచడం, ఆయుధ కర్మాగారాలను పునరుద్ధరించడం వంటి పలు అంశాలపై ప్రభుత్వం పని చేసిందని రక్షణ మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ వైద్య పర్యాటక రంగం.. ఆర్థిక వృద్ధిని సాధించడం, ఉపాధిని కల్పించడంతో పాటు అంతర్జాతీయ సద్భావనను సంపాదించే సామర్థ్యాన్ని కలిగి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `సంజీవని-2026 హెల్త్‌కేర్ అండ్ వెల్నెస్ ఎక్స్‌పో`లో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ అందించడంలో దేశం ఒక ఉన్నత నాణ్యతా ప్రమాణాన్ని నెలకొల్పాలని అన్నారు. `అతిథి దేవో భవ` అనే సాంప్రదాయ స్ఫూర్తిని పాటిస్తూ.. ఉన్నత ప్రమాణాలు, నైతిక విలువలతో వ్యవహరించాలని ఉద్ఘాటించారు. గత ఏడేళ్లలో 35 లక్షల మంది రోగులు భారత ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా ప్రయోజనం పొందారన్న ఆయన.. ప్రతి సంవత్సరం కోటి మందికి పైగా అంతర్జాతీయ రోగులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్ళాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత్.. లాభాపేక్ష లేకుండా 100కు పైగా దేశాలకు మందులను, వైద్య పరికరాలను అందించిందని పీయూష్ గోయల్ తెలియజేస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

========================

రానున్న బ్రిక్స్ సదస్సు-2026 సందర్భంగా సన్నద్ధతను సమీక్షించేందుకు, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ఈరోజు ఒక అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. తూర్పు రేంజ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్.. మిలింద్ మహాదేవ్ డుంబెరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం.. సదస్సు సమయంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర ప్రతిస్పందన, సరిహద్దు నిఘా, రాకపోకల నిర్వహణ కోసం రాష్ట్రాలు, జిల్లాల మధ్య సమన్వయం సజావుగా ఉండేలా చూడటం మొదలైన అంశాలపై దృష్టి సారించిందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం లేదా భద్రతా సమాచారం అందినప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండి.. తక్షణ చర్యలు తీసుకునేలా తమ సిబ్బందికి సూచించాలని సంబంధిత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్.. స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించామని పోలీసులు వెల్లడించారు.

========================

తూర్పు పశ్చిమ ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు దేశ రవాణా, లాజిస్టిక్స్ రంగానికి వెన్నెముకగా నిలుస్తాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అహ్మదాబాద్ విమానాశ్రయంలో ఈరోజు కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ మెగా ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు జాతికి అంకితం చేస్తారని తెలిపారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టు పురోగతిని వివరిస్తూ.. సూరత్-బిలిమోరా విభాగాన్ని వచ్చే ఏడాదిలోగా కార్యాచరణలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వాపి నుండి సూరత్ వరకు విస్తరించి ఉన్న సివిల్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి అవుతాయన్నారు. బుల్లెట్ రైలు కోచ్‌ల ఉత్పత్తి వేగంగా జరుగుతోందని, తొలి టెస్ట్ కోచ్ ఇప్పటికే సిద్ధమైందని అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ..

(వాయిస్ 27 సెకన్లు)

========================

`ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం` అనే ఇతివృత్తంతో ఈనెల 23న నాగ్‌పూర్‌లో మొదటి ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తామని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆయుర్వేద దినోత్సవం ఒక ప్రజా ఉద్యమంగా మారాలని, ఆయుర్వేదంపై ఆధారాలతో కూడిన సమాచారం దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికి చేరాలన్నారు. భారతదేశ ప్రాచీన విజ్ఞాన వ్యవస్థను ప్రపంచ ఆరోగ్య సంరక్షణకు అనుగుణంగా మారుస్తూ.. ముందుకు తీసుకెళ్లడానికి ఆయుర్వేద దినోత్సవం ఒక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన భారతదేశాన్ని, భవిష్యత్‌ను నిర్మించడంలో ఆయుర్వేదం ఒక కీలక స్తంభంగా మారాలని కేంద్రమంత్రి ఆకాంక్షించారు.

========================

========================